# రవీంద్ర గీతాంజలి

## అనువాదం:గాయత్రి



(గతసంచిక నుంచి తరువాయి)

45

**అతని నిశ్శబ్దపు పద సవ్వడి**

నీవు వినలేదా?

అతడొస్తున్నాడొస్తున్నాడు

ఎల్లవేళలా వస్తూనే ఉన్నాడు !

ప్రతి క్షణం, ప్రతి యుగం

ప్రతిరోజూ, ప్రతి రాత్రీ

అతనొస్తూనే ఉన్నాడు

ఎన్నో మనోభావాలతో పాడిన నా పాటలన్నీ

అతడొస్తున్నాడొస్తున్నాడు

ఎల్లవేళలా వస్తూనే ఉన్నాడనే చాటి చెప్తాయి!

తొలివేసవి పరిమళాలతో

అడవి దారిగుండా

అతడొస్తున్నాడొస్తున్నాడు

ఎల్లవేళలా వస్తూనే ఉన్నాడు !

వర్షఋతువున

ముసురుపట్టిన రాత్రులలో

మేఖలల ఉరుము రథంపై

అతడొస్తున్నాడొస్తున్నాడు

ఎల్లవేళలా వస్తూనే ఉన్నాడు !

వెతల వెంట వెతలలో

అతని జాడలు నా హృదయాన్ని హత్తుకోనున్నాయి

స్వర్ణతుల్యమైన అతని పాద స్పర్శ

నా ఆనందాన్ని వెలిగిస్తోంది!

****

46

**నాకు తెలీదు**

ఎంతకాలం నుండి నీవు
కలుసుకోవాలని న సమీపానికి వస్తున్నావో
నీ సూరీడు, చుక్కలు
నా నుండి నిన్నెల్లకాలమూ దాచి ఉంచలేవు..

ఎన్నో ఉదయాలు సాయంకాలాలలో
నీ పదసవ్వడి వింటూనే ఉన్నా
నీ వార్తాహరుడు నా ఎదలో చేరి
రహస్యంగా పిలిచాడు

నాకు తెలీదు
ఎందుకు  నా జీవితం
ఈ రోజు అస్థిరంగా ఉందో
సంతోష తరంగాలు
నా ఎడదలో ప్రవహిస్తున్నాయి!

నా పని పూర్తయే వేళ
కావచ్చినట్టుంది
గాలిలో తీయని నీ ఉనికి ఛాయల
సుగంధాలు తోస్తున్నాయి!

****

47

దాదాపు రేయంతా
అతనికై నిరీక్షించా వృధాగా
ఉదయాన నేనలసి నిదురించిన వేళ
అకస్మాత్తుగా నా గుమ్మం వద్దకు వస్తాడేమోనని భయం
సఖులారా, అతనికి దారివ్వండి
అడ్డుపడకండి!
అతని పదధ్వని నన్ను మేల్కొల్పకపోతే
నన్ను లేపవద్దని విన్నపం
ప్రాభాత కాంతుల ఉత్సవంలో
పక్షుల కిలకిలారవాలు
గాలొరొదలు నన్ను నిదురలేపకుండాలని కోరిక
నా ప్రభువు గుమ్మం వద్దకు
అకస్మాత్తుగా ఏతెంచినా సరే
నా నిద్రను భంగం కానీకండి !
నా విలువైన నిదుర
అతని స్పర్శతో అదృశ్యం కావాలని నిరీక్షిస్తోంది
ఆహా, మూసిన నా కనులు
చీకటి నిదురలో ప్రభవించే కలలాగా
ఎదుట నిలిచిన అతని నవ్వుల కాంతిలోనే
రెప్ప విచ్చుకుంటాయి!
అన్ని కాంతుల రూపాల ఆ నిగా
అతన్ని నా దృష్టి ఎదుట నిలువనీయండి
చైతన్యమైన నా ఆత్మపొందే
ఆనందపు తొలకరి జల్లు
అతని వీక్షణ నుండి రానీయండి
నాలో నా చేరిక
వెంటనే అతని చేరికగా కానిండు!

****

48

ప్రాభాత మౌన సంద్రం పక్షిపాటల అలలుగా విచ్చుకుంది
బాట పక్కన పూలు
 ఆనందంలో తేలియాడుతున్నాయి
 మేఘాలు చీల్చుకుంటూ
 పసిడి భాగ్యరేఖలు పరచుకుంటున్నాయి
ఐనా, మా దారివెంట
మేం వడిగా పోతూ
ఇవేవీ పట్టించుకోవడం లేదు
ఆనందగీతాలు పాడనూ లేదు
ఆడనూ లేదు
గ్రామానికి మారుబేరానికైనా పోలేదు
ఒక్క మాట పలుకలేదు
కనీసం నవ్వలేదు
దారిలో గుసగుసలైనా లేవు
కాలం దాటిపోతోందని
మా నడక వేగం మరింత పెంచాం..

సూరీడు నడినెత్తి కొచ్చాడు
పావురాలు నీడన కూస్తున్నాయి
ఎండుటాకులు మధ్యాన్నపు వేడిగాలిలో
సుడులు తిరుగుతూ నాట్యం చేస్తున్నాయి
పశువుల కాపరి మఱ్ఱిచెట్టు నీడన
నిదురమత్తులో కలవరిస్తున్నాడు
నీటిదాపుల నేను
అలసిన నా శరీరాన్ని
పచ్చికపై పరుస్తూ కూలబడ్డా!

నా తోటివారు నన్నుచూసి
తిరస్కారంగా నవ్వారు
వారు తలలెగరేస్తూ వడివడిగా వెళ్ళారు

వెనక్కి తిరిగి చూడలేదు
విశ్రమించనైనా లేదు
సుదూర నీలి తీరాలలో అదృశ్యమైనారు
కొండలూ లోయలూ దాటుకుంటూ
నూతన దూర దేశాలగుండా వెళ్ళారు
అనంత పదాధిపుడా జయము నీకు!

హేళన, తిరస్కారం నను బాధించినా
నాలో చలనం లేదు
మసక వెలుతురు నీడమాటున
నిస్పృహానందపు లోతులో నన్ను నేను పోగొట్టుకున్నా..

నెమ్మదిగా నా హృదయాన్ని
వెలుగు రేఖలు పొదిగిన
మసకబారిన ఆకుపచ్చ కాంతి ఆవరిస్తోంది
నా ప్రయాణ మెందుకో మరచా
నీడల పాటల చిక్కుముడికి
ప్రతిఘటన లేకుండానే నా మనసర్పించేశా!

చివరికి గాఢనిద్రనుండి మేల్కొని
కనులు తెరిచేసరికి
నా నిద్రను నీ నవ్వులో ముంచేస్తూ
ఎదుట నిల్చొన్న నిను చూశా
గమ్యం దూరమని, కష్టమని
నినుచేరేందుకు పోరాటం కఠినమని
నేనెందుకు భయపడ్డాను?

****

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

POST YOUR COMMENTS